దేముడున్నాడు

గుమ్మా నిత్యకళ్యాణమ్మ



పురుషుల్లో ఉత్తములు,మధ్యములు, అధములు అనే మూడురకాల వారుంటారు. అలాగే విద్యార్థుల లోనూ మూడు రకాల వారుంటారు అంటాడు సుబ్బారావు.

సుబ్బారావు అప్పారావు ఒకే కంచంలో తింటూ ఒకే మంచంలో పడుక్కుంటూ, ఒకే రూంలో వుంటున్నా ఉత్తర దక్షిణ ధ్రువాల వంటి వారు.

సుబ్బారావు అభిప్రాయంతో అప్పారావు ఏకీభంచలేదు. "కాదు విద్యార్థులలో రెండు తెగలే" అంటాడు అప్పారావు. "ఒకరు పరీక్షలు పాసవ్వాలనే ధ్యేయం కలవారు, తప్పినా ఫరవాలేదు అనుకునే వారు" అని అతని వాదం.

"అక్కడే పొరపాటు పడుతున్నావు. సామదాన భేదోపాయాలలో ఏదో ఒక వుపాయం ద్వారా పాసవ్వాలనే అనుకుంటాడు ప్రతీ విద్యార్థి. సంవత్సరం పొడుగునా క్లాసులకి వెళ్ళి శ్రద్ధగా చదివి అర్థం కాని విషయాలు టీచర్ల ఇళ్లకు వెళ్లి తెలుసుకుని పగలూ రాత్రి బట్టీపట్టి పాసయ్యే వాళ్లు. వీళ్లకు మరోలోకం చదువు మా లోకం తప్ప. కాబట్టి వీళ్ల అధములు. వీళ్లంత కాకపోయినా ఏవో నాలుగు ఆన్సర్లు కంఠతాపెట్టి పాసయ్యేవాళ్లు మధ్యములు. వీరికి రాంకు రాకపోయినా పాసుకావడం తధ్యం. ఇక ఉత్తములున్నారే వాళ్లు తామరాకు మీద నీటిబొట్టు లాంటి వారు. కాలేజీలకు క్లాసులకు వీలుంటే వెళ్తారు, అంటే మంచి సినిమాలు గట్రా లేకపోతే. పరీక్ష కోసమని ఎలాంటి ప్రయత్నాలు చెయ్యరు. ఫారిన్ ఎయిడ్ వలనో, కాపీ కొట్టో పాసుకాలేమా అని ధీమాగా వుంటారు. డిగ్రీ రావడమే ముఖ్యం కాబట్టి ఏడాదల్లా చదవడం వృధా అనేది ఈ ఉత్తముల లక్షణం" సుబ్బారావు తన వాదాన్ని బలపరుస్తాడు.

అప్పారావు మూడుమార్లు దండయాత్రలు కొట్టి పట్టు విడవని విక్రమార్కుడిలా నాలుగోసారి బీకాం చదువుతున్నాడు. సుబ్బారావుకి అంత అనుభవం లేదు అయితే అతనూ అదే పరీక్ష యిస్తున్నాడు.

ముందు రాసిన పరీక్ష వలన రిజల్టు ఎటూ తెలిసిపోయింది కాబట్టి ఆఖరి రోజు పరీక్ష రాయక పోయినా నష్టం లేదని అప్పారావు అప్సరాలో ఆంగ్ల పిక్చరు రెండో ఆట చూసొచ్చి లైటార్పి పరవశంగా పవ్వళింపుసేవ చేస్తున్నాడు. భారతదేశ ప్రభుత్వమే పంచవర్ష ప్రణాళికలను అమలు జరుపుతున్నప్పుడు ఆదేశ పౌరుడైన తాను బీ. కాం. పంచవర్షాల్లో పూర్తి చేయగలుగుతే నవ్విపోయేది ఎవరు? అథవా నవ్వుతారా వాళ్ళు పుచ్చిపళ్ళే కనుపిస్తాయి, తనవి కావు.

సుబ్బారావు ఆ సమయంలో అటు సినిమా హాలులోనూ లేడు ఇటు రూంలోనూ లేడు.

పక్కవాడి పరోపకారం వలన ఒక పేపరు, ఫారిన్ఎయిడ్ సహాయంతో మరో పేపరు ఒక మోస్తరుగానే రాసాడు. మూడో పేపరే కొంచెం ఇబ్బందిగా వుంది. రోజులన్నీ ఒకే లాగుంటే ఎలాంటి శోకా వుండదు ఖర్మ కాలిందే అనుకోవాలి. ఇంత కాలం కుంభకర్ణుడిలా నిద్రపోతున్న యూనివర్శిటీ వాళ్ళు అమాంతంగా కళ్ళు తెరచారు. పరీక్షలలో అవినీతి ప్రబలి పోతున్నది. ప్రతి విద్యార్థి గైడ్లు పక్కన పెట్టుకునో, పక్కవాడి నుంచి కాపీకొట్టో, బయట నుంచి రడీమేడ్ ఆన్సర్లు తెప్పించో పరీక్షలు రాస్తున్నట్లు నిద్ర మేల్కొన్న యూనివర్శిటీ వాళ్ళు గ్రహించారు. స్పెషల్ స్క్వాడ్‌లు పరీక్షా కేంద్రాలకు పంపుతున్నట్లు, పోలీసుల సహాయం తీసుకోబో తున్నట్లు ప్రకటించారు అవినీతికి పాల్పడే విద్యార్థులను మూడు సంవత్సరాల వరకు పరీక్షలకు కూర్చోనివ్వం అని ఎనౌన్సు చేసారు సుబ్బారావు ప్రక్కవాడు బెంబేలు పడిపోయాడు పరుగు పరుగున సుబ్బారావు దగ్గరకొచ్చి "అయ్యా! సుబ్బారావుగారూ! ఇవి చేతులు కావు కాళ్ళు" అని అంటూవుండగా "నీకేం మతిలేదా! ఇవి చేతులేనయ్యా కాళ్ళు కావు రేపొక్కరోజు గడిచే వరకు మతిపోగొట్టుకోకు ఆ తర్వాత నీ దారి నీది" అందామనుకుంటూవుండగా "బాబూ! రేపు మీరు నా పక్కకు కాని నా పేపరు పక్కకు కాని చూడకండి. లేకుంటే నా చదువు నట్టేట మునిగిపోతుంది మా నాన్న నామీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు" అంటూ ఏడ్చినంత పని చేసి చివరకు ఏడ్చేసాడు.

అన్నీ సవ్యంగా వుండి ఆఖరిరోజు పరీక్ష కూడా ఎవరిదో ఒకరి సహాయంతో ఒక మోస్తరుగారాస్తే ఆ పైన మోడరేషను బోర్డు వారు కనికరించి ఒకింత సహాయం చేయకపోతారా? తను సుబ్బారావు బి.కాం. అనే బోర్డు తగిలించుకొని నిరుద్యోగుల లైనులో చేరిపోయి ఎంప్లాయిమెంటుఎక్చేంజి చుట్టూ రోజూ ప్రదక్షిణాలు చేయవచ్చునని పొంగిపోయిన సుబ్బారావు పరిస్థితులను అర్థం చేసుకొని నీరసించుకుపోయాడు మరి యిప్పుడు గట్టెక్కడం ఎట్లా? ఏడాదిలో ఏడు పీరియడ్లు కూడా ఎటెండుకాలేదు. వెధవ సినిమాలవలన చదవడానికి టైము దొరకలేదు సినిమాలదా అసలు తప్పు— ఠంచనుగా జీతాలందగానే తనకు డబ్బు పంపే తండ్రిది కాదూ అసలు తప్పు?

మామూలుగా అయితే అతను సాయంత్రాలు ఆడపిల్లల అందాలను వీక్షించడానికి బజారు వెంట తిరిగేవాడు. ఆ రోజు ఆ కార్యక్రమాన్ని కూడా రద్దు చేసుకొని పేపరు లీక్ అయి వుంటుందన్న చివరి ఆశతో ఆ బజారూ ఈ బజారూకాలు కాలిన పిల్లిలా తిరిగాడు. ఫలితం లేకపోయింది. రాత్రంతా శివరాత్రి చేసైనా చదువుదామనుకుంటే 'వన్‌డే సీరీస్ గైడు' ఏ దుకాణంలోనూ దొరకలేదు బొటాఫ్

స్టాకు. సుబ్బారావు పరిస్థితి అర్థం చేసుకున్న ఒక షాపువాడు కనికరించి ''రేపు రండి తెప్పించి వుంచుతాం'' అన్నాడు, రేపేం చేసుకుంటాడు? రేపు దాని విలువ చిత్తు కాగితాలపాటి చెయ్యదు.

'ఈ పేపర్లో జీరో. వెరశి పరీక్షా ఫలితాల పేపర్లో తన నంబరు ఔట్! ఏడాది చదువూ వ్యర్థమౌతుంది.' అనుకున్నాడు సుబ్బారావు. అనుకోవడమేనా బాధపడిపోయి ఆ మాటే సాయంత్రం అప్పారావుతో అనమూ అన్నాడు.

''ఒరే! అబ్బీ! పరీక్షపాసై మాత్రం ఏం చేస్తావురా? నిరుద్యోగుల జాబితాలో చేరి ప్రయోజనం ఏమిటి? కిరసనాయిల్ క్యూలోలాగ యిప్పటికే లక్షల మంది వున్నారు. అందువలన ఉద్యోగం దొరికే ఛాన్సులు నిల్లు. పోనీ పై చదువులకు పోవాలనుకుంటున్నావా? థర్డుక్లాసులో పాసయ్యే నీకు ఏ కాలేజీలో సీటు దొరుకుతుంది. మంత్రులు సామంతులు డొనేషన్లు ఇచ్చే వారు ఇందరుండగా నిన్ను అసలు కాలేజీ కాంపస్‌లోనికి రానిస్తారా? నా మాట విని ఆ పేపరైనా పాడు చేసి మరో ఏడు స్టూడెంటుగా వుండిపో. 'ఉద్యోగం సద్యోగం లేకుండా మూడు పూట్లా రోడ్లు సర్వే చేస్తావా? వెధవా!' అని మీ నాన్న చేత చీవాట్లు తినే యోగం తప్పడమే కాక నెలనెలా నీ భరణం డబ్బులు మరో ఏడాది ముడతాయి. పరీక్షకేముంది మార్చి కాకపోతే సెప్టెంబరు వుండనే వుంది. అందులోనూ తప్పావా తిరిగి మార్చి వస్తుంది. ఇలా మార్చిలోనూ సెప్టెంబరులోనూ దివ్యంగా రాయొచ్చు. అడ్డేవాడెవడు? ఏదో ఛాన్సులో నీ పుణ్యం పుచ్చిపోవచ్చు మరో సంగతి. సావధానంగా విను. ఇప్పుడే పాసై నిరుద్యోగి అయ్యే కంటే మరికొన్ని ఏళ్ళు తరువాత పాసై నిరుద్యోగుల లైనులో చేరితే నిఖరంగా ఒక లాభం వుంటుంది. మన సీనియర్లు నిరుద్యోగ భత్యం కావాలని ఆందోళన చేస్తున్నారు. నీవు ఇపుడే వాళ్ళతో చేరితే ఇటు పోలీసు కాల్పుల్లో కాలో చెయ్యో విరిగే యోగమో లేదా అటు శ్రీకృష్ణ జన్మస్థాన యోగమో వుంటాయి. ఈ సద్దుమణగనీ! ఎటూ రెండు మూడేళ్ళలో ప్రభుత్వం వాళ్ళ డిమాండు ఫుల్‌ఫిల్ చేస్తుంది. అంచేత ఆ భరణం ఎనౌన్స్ అయ్యేవరకు మార్చిలు సెప్టెంబరులు కానిచ్చెయ్. అలాగైతే అంతవరకు నీ తండ్రి పంపే భరణం ఆ తరువాత ప్రభుత్వం ఇచ్చే భరణం అందుతాయి. లేదా రెండిటికి చెడ్డ రేవడివౌతావు తెలుసుకోరా శుంఠా!'' అన్నాడు అపర శ్రీకృష్ణ పరమాత్ముడి పోజులో

విద్యార్థులలో ఉత్తముడి కుండే లక్షణాలు తన కున్నాయని కాకపోయినా అప్పారావు చెప్పే రెండో తెగకు తాను చెందనని భావించే సుబ్బారావుకి అతని సలహా రోగికి వైద్యుడిచ్చిన మందులా చేదుగా వుంది.

అయ్యా! ఇదంతా కథకు ఉపోద్ఘాతమే! ఉపోద్ఘాతంలో కొంత కథ నడిచినా లేదా మీకు కథ కొంతవరకు అర్థమైనా అసలు కథ ఇది కాదు.

శీర్షికను మీరు గమనించే వుంటారు. పోనీ మరోమారు చూడండి. 'దేముడు ఉన్నాడు!'

దేముడు లేడూ?

లేకేమండి. మహారాజు లాగున్నాడు. అయితే మీకూ నాకూ కనిపించడు. అయినా దేముడున్నాడు, అతను సర్వాంతర్యామి అంటారు అందరూ అంటారో లేదో కాని ప్రహ్లాదుడనే భక్తుడు తండ్రితో ఆ మాట చెప్పినట్లు భాగవతాన్ని రాసిన బమ్మెర పోతన్నగారు అన్నారట అని మా అమ్మమ్మ చెప్పేది.

దేముడు వున్నాడు అనే సత్యం సుబ్బారావుకి ఆ అర్ధరాత్రి తెలిసింది. తెలిసింది అనే కంటే ఆ సత్యాన్ని ఆలకించాడు అని చెప్తే కరక్టుగా వుంటుంది. ఆదెలాగంటే గైడ్లకోసం తిరిగి తిరిగి వేసారి యింటికొస్తూవుంటే 'దేముడు భక్తుల పాలిట ఆపద్బాంధవుడు, చెయెత్తి మొక్కితే కోరికలు తీరుస్తాడు, అని హరికథ చెప్తున్న దాసుగారి పలుకులు సుబ్బారావు చెవుల్లో దూరాయి. ఇంకేం రాముడున్నాడు అనుకున్నాడు సుబ్బారావు

అలా అనుకున్న సుబ్బారావు బుర్ర గబ గబా పని చేసింది. అమాంతంగా ఒక బ్రహ్మాండమైన ఆలోచన తట్టింది.

'రామా! నారాయణా! వెంకటేశ్వరా! శివా! ఆంజనేయా!' అని మనసులోనే మననం చేసుకొని 'నన్ను పరీక్ష గట్టెక్కించే భారం నీదే స్వామీ' అన్నాడు గట్టిగా.

త్వరత్వరగా రూంకి చేరుకున్నాడు.

అప్పారావు గురకలు పెడుతూ నిద్ర పోతున్నాడు.

దీపం వేయగానే అతని మనసులా గదంతా వెలిగిపోయింది. ఎప్పుడో చిన్నప్పుడు చదివిన సామెత 'గాలిలో దీపం పెట్టి దేముడా నీదే భారం' అంటే దీపం ఆరిపోకుండా ఆ భగవంతుడు కూడా చేయలేడట' గుర్తు కొచ్చింది. మానవ ప్రయత్నం వుంటేనే భగవంతుడు సహాయం చేసేది. వెంటనే రేపు జరగబోయే పరీక్ష సంబంధించిన పుస్తకం తీసాడు.

పుస్తకం భూతంలాగ, అందులోని అక్షరాలు రాక్షసుల్లాగా కనిపించాయి. ఈ పుస్తకాన్ని ఇన్నాళ్ల వరకు తెరిచిన పాపాన పోలేదు. ఇన్ని పేజీల పుస్తకంలో ఏ ఛాప్టరు చదవడం? చదివినా అర్థం ఔతుందా??

'సుబ్బారావూ!'

''ఆఁ!'' అన్నాడు సుబ్బారావు.

'సుబ్బారావు! వింటున్నావా?' తిరిగి అదే కంఠం.

''ఏంరా వెధవా! ఏదీ చెప్పకుండా వింటున్నావా? అని ఏమిటా ప్రశ్న?'' అంటూ అప్పారావు వంక చూసాడు. ఆశ్చర్యం!! అప్పారావు ఈ లోకంలో లేడు. రావణాసురిడి తమ్ముడులాగ గురక మాత్రం వినిపిస్తున్నాది. వాడు తనని పిలిచాడా? ఉహూ! అసంభవం, మరి ఎవరు పిలిచారు??

- 'నేనోయ్ నిన్ను పిలుస్తున్నది. అప్పారావు కాదు. ఆశ్చర్యపోతావే?' అదే కంఠం.

మనిషి లేడు. కంఠం వినిపిస్తున్నాది కల కూడా కాదు, తాను మేలుకొనే వున్నాడు సుబ్బారావుకి భయం వేసింది.

పార్యపుస్తకాలలో రాసింది జ్ఞాపకం రాకపోయినా కనీసం ఆంజనేయ దండకమైనా కంఠతా వచ్చి వుండవలసింది ఛీ! అదీ తనకు రాదు. మరో గత్యంతరం లేక 'ఆంజనేయా!' అన్నాడు గట్టిగా

నేపథ్యంలో అంతకన్నా బిగ్గరగా నవ్వు!

'ఒరేయ్! నేను పిలుస్తున్నాను నేను నీ అంతరాత్మను! దయ్యాన్ని భూతాన్ని కాను'

''అంతరాత్మవా!? చచ్చాను! ఇంకా ఏ దయ్యమోనని భయపడిపోయాను''

'నిజంగా దడుచుకున్నావా? అంతరాత్మకే దడుసుకున్నావా?'

''అంతరాత్మనని ముందుగా చెప్పావా? చెప్పా పెట్టకుండా అర్ధరాత్రి అలాపిలుస్తే దడుసుకోనూ? ఇంతకీ ఏమిటి నీ ఏడుపు?''

'ఆ పుస్తకం నీకు అర్థమౌతుందా? రాత్రి చదివి అర్థం చేసుకొని రాయగలవా?'

''కాదు. లేను. లేను ఏకంగా అన్ని ప్రశ్నలా?''

'నేనొక చిన్న చిట్కా చెప్పనా?'

''బాబ్బాబూ! చెప్పి పుణ్యం కట్టుకో చచ్చి నీ కడుపున పుడతాను!''

'నా కడుపునా? నువ్వూ నేనూ వేరా? నేను నీ అంతరాత్మను'

''అదా! అలా అనడం రివాజు. పోనీ చచ్చి నీ కడుపున పుట్టనులే!''

'అసలు నీకు చావాలని లేదు. నాకు తెలుసు'

''ఇంతకీ నీ చిట్కా ఏమిటి?''

'దేముడు వున్నాడని నమ్ముతావా?'

''ఉండే వుంటాడు. అయితే నాకెప్పుడూ కనుపించలేదు.''

'ఎందుకు కనుపిస్తాడు? కనుపిస్తే మీరు దేముణ్ణి బ్రతకనిస్తారా?'

''ఇంతకీ నీవు చెప్పేదేమిటి? విసిగించకు''

'అదే చెప్తున్నాను దేముడు సుఖాల్లో గుర్తు రాకున్నా కష్టాలలో తప్పకుండా గుర్తుకొస్తాడు నీకే కాదులే మానవులందరికీనూ అందుచేత ఈ పరీక్ష గట్టెక్కితే వాడికి ప్రసాదం ఇస్తానని దండం పెట్టుకో. పాపం! అతను దీనదయాళుడు. భక్తుల కోరిక తప్పక తీరుస్తాడు. ఏం వింటున్నావా?'

''అంతరాత్మవనిపించుకున్నావు. ఎంత చల్లటి మాట చెప్పావు.''

సుబ్బారావు గట్టిగా కళ్ళుమూసుకుని గోడ వంక తిరిగి కళ్ళు విప్పాడు. గోడ మీద హిందీ నటి అర్ధ నగ్న ఫొటో కనుపించింది. రామరామ అనుకుని కళ్ళు మూసుకొని ఎదురు గోడ వంక తిరిగి కళ్ళు విప్పాడు. ఆ గోడ మీద నిలువుటద్దంలో అదే ఫొటో నవ్వుతూ పలకరించింది. మళ్ళీ రామరామ అనుకొని కళ్ళు మూసుకున్నాడు. మరో పక్కకు తిరిగి గోడ వంక చూసాడు. ఈసారి తెలుగు తెర వెలుగుల తారామణి కేబరా డాన్సు పోజులో కనిపించింది. హరీ హరీ! అనుకున్నాడు.

'సుబ్బారావ్! ఇంక నీ సర్కసు ఆపు. మరే దిక్కూ చూడకు. విద్యార్థుల గదుల్లో సినీతారలు కాక దేముళ్ళుంటారా? దేముడు గోడ మీద బొమ్మలోనే వుండనక్కరలేదు. ఇందుగలడందు లేడని సందేహం వలదు అన్నారు పెద్దలు. మనస్సులో ధ్యానించుకో చాలు' అంతరాత్మ తిరిగి పలికింది.

జ్ఞానోదయమైంది సుబ్బారావుకి.

"సింహాద్రి అప్పన్నా! ఈ సబ్జెక్టులో నాకు నాలుగంటే నాలుగు ప్రశ్నలకే జవాబులొచ్చు. రేపటి పరీక్షలో ఆ నాలుగు ప్రశ్నలు వస్తే నేను పాసౌతాను. ఈ భక్తుడి మీద దయ వుంచి ఆ నాలుగు ప్రశ్నలు వచ్చేటట్లు చెయ్యి. నా కోరిక నెరవేరుస్తే నీకు అయిదు కేజీల చక్రపొంగలి, పులిహోరా నైవేద్యం పెట్టిస్తాను. నువ్వు భక్తుల పాలిట కల్పవృక్షానివి. వరాల దేముడివి" అన్నాడు.

"ఒరేయ్! అప్పన్నా అనకపోతే అప్పారావు అనలేవూ? చక్రపొంగలి పులిహోరె డరతావా!? సంతోషం!"

ఆశ్చర్యం! ఈ మాటలు అంతరాత్మవి కావు. మరెవరివి? దేముడు మాట్లాడుతాడా? అసలు కనుపించని వాడికి కంఠం వుంటుందా?? మరి ఈ విచిత్రానికి హేతువు ఏమిటి?

మంచం మీద లేచి బాసింపట్టు వేసుకు కూర్చున్న అప్పారావును సుబ్బారావు గమనించలేదు.

"ఒరే అప్పన్నా అంటే నాకు చెప్పలేనంత కోపం వస్తుందని నీకు తెలుసు. అయినా అలా పిలిచావు. చక్రపొంగలి, పులిహోరా పెడతానన్నావు కాబట్టి ఈ సారికి క్షమిస్తున్నాను" అన్నాడు అప్పారావు. వాడు భుజం మీద చరిచి వుండకపోతే యింకా బోలెడు హాశ్చర్యపోతూనే వుండేవాడేమో సుబ్బారావు.

"హారినీ! నీకు కాదురా వెర్రిముగమా! నేను చక్రపొంగలీ పులిహోరా ఆ సింహాద్రి అప్పన్నకు నైవేద్యం పెడతానని మొక్కుకుంటున్నాను."

"ఏమిటి నువ్వు దేముడిని నమ్ముతున్నావా? బీ. సీ. లో పుట్టవలసిన వాడివి."

"ఏం ఎందుకు నమ్మకూడదు? నేను ఆపదలో లేనా? నా పరీక్ష మాటేమిటి?"

"ఒరేయ్! పిచ్చి సన్యాసీ! అక్షరంముక్కరాని నిన్ను పరీక్ష ఎలా పాసు చేస్తాడురా దేముడు."

"తప్పురా! దేముడ్ని అలా అనకూడదు. నాకు నాలుగు ప్రశ్నలకు జవాబులొచ్చు. ఆ నాలుగు ప్రశ్నలూ రేపు పేపర్లో వస్తే నేను పాసుకాలేనా? అందుకే నా ప్రార్థన" అన్నాడు సుబ్బారావు.

భారం భగవంతుడి మీద వేసి, చదవవలసిన పుస్తకాన్నే తలగడగా చేసుకొని నిశ్చింతగా నిద్రపోయాడు -సుబ్బారావు. అసలే బాదరా బందిలేని అప్పారావు రెండో మారు ముసుగులో దూరేడు సినిమా హిరోయిన్ను కలలో కలవడానికి.

* * *

దేముడనేవాడు వున్నాడు. అతడు భక్తుల కోరిక తీరుస్తాడు అన్న నిదర్శనంగానో లేదా కాకతాళీయంగానో ఆ రోజు సుబ్బారావు తలపోసుకున్న నాలుగు ప్రశ్నలూ వచ్చాయి. సుబ్బారావు ఆనందం వర్ణనాతీతం.

మరో మారు సింహాద్రి అప్పన్నకు దండం పెట్టి గబ గబా తనకొచ్చిన ఆన్సర్లు రాసాడు. పేపరు మూడు గంటలదైనా రెండు గంటల్లో పూర్తిచేసాడు. ఇంకా గంట సమయం మిగిలింది.

తన కోరిక తీర్చిన దేముడి నైవేద్యం గురించి ఆలోచించడం మొదలెట్టాడు.

ఇంతకీ ఖర్చు ఎంత అవుతుందో!? కాగితం మీద లెఖ్ఖ రాస్తే తేలిపోతుందిగా! జేబులు చూసాడు. కాగితాలు లేవు. మరెలాగ?

వాచర్ని సప్లిమెంటు కాపీ అడిగాడు. కావలసిన వస్తువులు గుర్తు తెచ్చుకొని 'పంచదార 25 రూపాయలు, బియ్యం పది రూపాయలు ...' వరుసగా వ్రాసాడు. ఆ తరువాత కూడాడు: నూరు రూపాయల చిల్లర.

'అమ్మో! నూరు రూపాయలే! ఆ డబ్బుతో పది సినిమాలు చూడొచ్చు'

'మరి నైవేద్యం పెట్టకపోవడం పాపం కాదూ? కలలో కూడా తలచుకోని భగవంతుడ్ని ఒక్కమారు అర్థించగానే తన కోరిక తీర్చాడే! మరి అతనికి పంగనామం ఎలా పెట్టడం?'

'భగవంతుడికి పెట్టే నైవేద్యం హోటల్లో చేసినట్లు కిస్మిస్‌లూ ఏలకులూ ఎందుకు?'

వాటిని కొట్టేసాడు. ఆరు రూపాయలు తగ్గాయి. ఇంకా ఎక్కువే!

'నెయ్యికి బదులు డాల్డా చాలు.'

మరో పది ఆదా అయింది.

ఆంధ్రపత్రిక

దినపత్రికలో

* మన సినిమాలు

* వింత యదార్థం

శీర్షికలు

చూస్తున్నారా?

'ఎనభై నాలుగు రూపాయలు మాత్రం ఎక్కువ కాదేమిటి?'

ఇంకా ఏమేమి తగ్గించవచ్చునో ఆలోచిస్తూ ఒక్కొక్కటికి కొట్టి వేయసాగాడు. ముప్పై అయిదు రూపాయలకు తగ్గింది. 'ఇది కొంత నయం. ముందు రాసినవన్నీ వుంచలేదు. ఎంతదండుగ!'

సుబ్బారావుకో అనుమానం వచ్చింది.

'దేముడు అంత తినగలడా? అసలు దేముడి పేరు చెప్పి తినేది పూజారి. పూజారికా తాను నైవేద్యం పెట్టేది? తినని దేముడికి అంతంత ఎందుకు? ఒక్కొక్క కేజీ చాలు. ప్రసాదానికి యింత అని కొలతా నియమంలేదు. భక్తితో ఎంత ఇచ్చినా సంతోషిస్తాడు. శ్రీకృష్ణుడికి కుచేలుడేమిచ్చాడు? గుప్పెడు అటుకులు. అందుకే ఫలం పుష్పం తోయం అంటారు.'

సుబ్బారావుకి ఒక దివ్యమైన అయిడియా వచ్చింది. 'రెండు అరటి పళ్ళు' నాలుగు పువ్వులు చాలు. రూపాయితో సరిపోతుంది.'

'ఇంతకంటే తగ్గించడం తప్పు' అనుకున్నాడు.

గంట కొట్టారు. వాచరు ఆన్సరు కాపీలు తీసుకుందికి వచ్చాడు. ఆన్సరు పేపరు వాచరు కందించి ప్రశ్నపత్రం, లిస్టు జేబులో పెట్టుకొని ఈల వేసుకుంటూ బయటకొచ్చాడు సుబ్బారావు బి.కాం.

అప్పారావసలు పరీక్షకే వెళ్ళలేదు. ఎలాగూ పోతుందన్న పరీక్షకు వెళ్ళడం అనవసరం అని.

"వండర్ ఫుల్! దేముడున్నాడురా!" అన్నాడు రూములో అడుగుపెట్టి.

"ఏమిటీ! నీకు కనిపించాడా?" అప్పారావు ఆశ్చర్యంగా అడిగాడు.

"కనుపిస్తే మనం బ్రతకనివ్వరుట! అందుకే కనుపించడు" సుబ్బారావు అన్నాడు.

"మరి ఎలా తెలుసుకున్నావురా కనుపించని భగవంతుడున్నట్లు?"

"నీకు తెలుసుగా నిన్న అప్పన్నకు దండం పెట్టాను"

"నాకా? నిజంగా? ఎప్పుడురా పెట్టావు దండం?"

"జోక్ కాదురా! నిన్నరాత్రి సింహాద్రి అప్పన్నకు దండం పెట్టి నా కొచ్చిన నాలుగు ప్రశ్నలు పేపర్లో వస్తే, నైవేద్యంగా చక్రపొంగలి పులిహోరా పెడతానని అన్నాను. ఆ నాలుగు ప్రశ్నలూ వచ్చాయిరా! నేను యమగా రాసాను:"

"నిజం!"

"నిజంరా" నువ్వూ దండంపెట్టి పరీక్షకు రావలసింది. నీది బేడ్ లక్కురా!'

"అయితే నీ దేముడు నిన్ను కరుణించేడంటావు. అయితే చక్రపొంగలి ప్రసాదంలో నాకూ వంతుందా?"

"అబ్బే! ఇప్పుడు ఆ ప్రోగ్రాం కేన్సిలురా! అసలు కనిపించని దేవుడు తింటాడా? దేముడి పేరు చెప్పి తినేది పూజారి. అందుకే ఒక్క రూపాయితో దేముడి ముడుపు చెల్లిస్తాను."

"ఏడిసావ్‌లే! ఇంతకీ ఆ ప్రశ్నలొచ్చాయా? లేక కోతలు కోస్తున్నావా?"

"నిజంరా! నీ మీద ఒట్టు!"

"నన్ను చూడనీ పేపరు"

"ఇంద" అంటూ జేబులోంచి పేపరు తీసి అప్పారావు కిచ్చాడు సుబ్బారావు.

"నిజమేరా! నేను నమ్మలేదు" అని అప్పారావు ఆ రెండో కాగితం చూసాడు. "ఒరేయ్! ఇదేమిరా!? నీ ఆన్సరు పేపరులాగుంది?"

"అదా! ఆన్సరు పేపరు కాదురా! ముందుగా ప్రసాదానికేం సరుకులు కావాలి? ఖర్చు ఎంత అవుతుందని లెఖ్ఖ రాయడానికి కాగితం లేక సప్లిమెంటరీ కాపీ వాచర్నడిగి తీసుకున్నాను. తీరా లెఖ్ఖ రాస్తే నూరు రూపాయల ఏభై పైసలు లెఖ్ఖ తేలింది. తినని దేముడి కింద అంత ఖర్చు ఎందుకని తరువాత ఆ ప్రయత్నం మానుకున్నాను" అన్నాడు గర్వంగా.

"సుబ్బారావు! నువ్వు పొరపాటు పడుతున్నావురా! ఇది లిస్టు కాదు. నీ ఆన్సరు పేపరే!"

"నిజమా? పొరపాటున తొందరలో లిస్టు వాచరు కిచ్చి ఆన్సరు పేపరు తెచ్చానా? ఒరేయ్ అప్పారావూ ఇప్పుడు నా గతేం కానురా? పొరపాటు జరిగిపోయింది దేముడోయ్!" అంటూ ఆన్సరు పేపరు బట్టుకుని కూలబడి పోయాడు సుబ్బారావు. ★